క్లుప్తంగా

మన్యం అభివృద్ధికి కృషి



పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును కలిసిన మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ కుటుంబ సభ్యులు

గూడెంకొత్తవీధి: మన్యం అభివృద్ధికి శాయ శక్తులా కృషి చేయాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందరి రామకృష్ణ పాడేరు ఎమ్మెల్యే మత్యరాస విశ్వేశ్వరరాజును కోరారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బుధవారం రామకృష్ణ కుటుంబ సభ్యులతో కలసి పాడేరు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని ఆప్యాయంగా పలకరించి తమ వంతు మన్యం అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు రూరల్: పాడేరు సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీలో బ్రేకర్స్ మార్పుల నేపథ్యంలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

యూటీఎఫ్ జెండా ఆవిష్కరణ



జెండాను ఆవిష్కరించిన ఉపాధ్యాయులు

అడ్డతీగల: త్వరలో నిర్వహించనున్న 17వ విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహణ సందర్భంగా రాష్ట్ర సంఘం పిలుపు మేరకు అడ్డతీగల ఎమ్మార్సీ వద్ద బుధవారం యూటీఎఫ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జనవరి 5 నుంచి 8వ తేదీ వరకూ కాకినాడలో జరగనున్న స్వర్ణోత్సవాలకు ఉపాధ్యాయులందరూ హాజరుకావాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు మంగరాజు, తేజోరావు కోరారు.మహిళా సహధ్యక్షురాలు రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాస్టర్‌కు సన్మానం



చుట్టుమెట్ట చర్చిలో పాస్టర్ తిమోతికి శాలువ కప్పి సన్మానిస్తున్న సంఘ పెద్దలు

జి.మాడుగుల: మండలంలో చుట్టుమెట్ట గ్రామంలో గ్రోత్ ఇన్ క్రైస్ట్ మిషన్ సాలం చర్చి వద్ద బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిషప్ వి.తిమోతి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. పాస్టర్ తిమోతిని సంఘ పెద్దలు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. సంఘ పెద్ద బొజ్జన్న, సంఘస్తులు రాజ్‌కుమార్, సుబ్బారావు, ప్రసాద్, రాజబాబు, జానీబాబు, నగేష్ దీనమ్మ, ముత్యాలమ్మ, వసంత పాల్గొన్నారు.

వైభవంగా సింహాద్రి అప్పన్న ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు : గొండుపాలెం గ్రామస్తులు సింహాద్రప్పన్న ఆలయ 9వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా జరిపారు. వార్షికోత్సవ కార్యక్రమాన్ని గ్రామానికి చెందిన గౌరీ సేవా సంఘం వారు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం గ్రామంలో సింహాద్రప్పన్న ప్రతిరూపంగా కొలిచే తోడపెద్దుతో పాటు ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో గల ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధనను నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మద్దాల రాజేంద్రప్రసాద్, మద్దాల రాము, జగ్గారావు, అప్పారావు, దేముడు, మాజీ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో న్యూ ఇయర్ వేడుకలు

- అంబరాన్నంటిన సంబరాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- చిన్నారులు, యువత సందడి



పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు పుష్పగుచ్ఛం అందచేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



ముంచంగిపుట్టులో ఎంపీపీ సీతమ్మకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీడీవో, ఎంఈవో తదితరులు



గరుడాపల్లిలో సహపంక్తి భోజనాల్లో గ్రామస్తులు



డుంబ్రిగుడ సారోన్ మందిరంలో దైవసందేశం చేస్తున్న పాస్టర్ అప్పారావు



మారేడుమిల్లి సీఎస్ఐ చర్చిలో నూతన సంవత్సర వేడుకలు



రాజవొమ్మంగిలో ప్రత్యేకాలంకరణలో షిర్డీ సాయిబాబా



అరకులోయలో దైవ సందేశాన్ని బోధిస్తున్న పాస్టర్ భాస్కరరావు



పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఐటీడీఏ అధికారులు, ఉద్యోగులు



ఐటీడీఏ పీవో సింహాచలంనకు నూతన ఇయర్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి తదితరులు

అరకులోయటౌన్: జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు అంగరంగ వైభవంగా బుధవారం జరిగాయి. ఎంతో ఉత్సాహంగా యువకులు,ఉద్యోగులు,వ్యాపారులు,నేతలు,విద్యార్థులు అంతా నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. ఇళ్ల ముంగిట రంగు రంగులతో అందమైన ముగ్గులను అలంకరించి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఒకరొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ కేక్‌లను కట్ చేసి సందడి చేశారు.పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలను చేశారు.

తెల్లవారుజాము నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు చేశారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు గీతాలు ఆలపించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం విందు భోజనం ఏర్పాటుచేశారు. ఒకొరికొకరు న్యూ ఇయర్ గ్రీటింగ్స్ తెలియజేసుకున్నారు. యువత మంగళవారం రాత్రి జరిగిన న్యూ ఇయర్ వేడుకలో కేరింతలతో సందడి చేశారు. చిన్నారులు సందడి నెలకొంది. వాడవాడలా సేవా కార్యక్రమాలు చేపట్టారు. అరకులోయ మండలంలోని అరకులోయ, బోసుబెడ, కొత్తభల్లుగుడ, బెంజిపూర్, గన్నెల, లోతేరు, సుంకరమెట్ట బాప్టిస్ట్ చర్చిలతో పాటు, మండల కేంద్రంలోని క్రైస్ట్ చర్చి, బెరాకా ప్రార్థన మందిరం, బెంజిపూర్, పెట్టమామిడివలస లూథరన్ మిషన్ ఆలయాలతో పాటు, యండపల్లివలసలోని కేథలిక్ చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. దైవ జనులు దైవసందేశాన్ని అందించారు.

డుంబ్రిగుడ: మండలంలోని సారోను, సీయోను, యూసీఐఎం, బేతేలు ప్రార్థన మందిరంతో పాటు మండలంలోని కించుమండ, అరకు, గుంటసీమ, సొవ్వా, గసభ, అరమ, కితలంగి తదితర గ్రామాల్లోని ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు అప్పారావు (జోనస్), కె.భాస్కర్‌రావు, బి.మనసే, సుదర్శన్ తదితరులు ప్రార్థనలు చేశారు.

ముంచంగిపుట్టు: మండలంలో గిరిజన గ్రామాల్లో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లో థింసా నృత్యాలతో సందడి చేశారు. మండల స్థాయి అధికారులు ఎంపీపీ సీతమ్మను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

హుకుంపేట: మండల కేంద్రంతో పాటు మండలంలోని గిరిజన గ్రామల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి మొదలుకొని బుధవారం ఉదయం వరకు వాడవాడల్లో డ్యాన్స్, థింసా నృత్యాలు, ఇతరత్రా సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. మండలంలోని గరుడాపల్లి గ్రామంలో గిరిజన సంప్రదాయంగా గ్రామస్తులంతా కలిసి విందు కార్యక్రమం నిర్వహించి సందడి చేశారు.

రంపచోడవరం: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఐటీడీఏ పీవో కట్టా సింహాచలంను బుధవారం ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి , వైస్ ఎంపీపీలు ఎంపీటీసీలు, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. పూల బొకేలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకొని మారేడుమిల్లిలోని సీఎస్ఐ చర్చిలో చట్లవాడ గ్రామస్తులకు ఆటల పోటీలు, బైబిల్ క్విజ్ నిర్వహించారు. విజేతలకు జెడ్పీటీసీ గొర్లె బాలాజీబాబు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీబాబు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని, ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంగా ఉండాలని, సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. కేక్ కట్ చేశారు. సీఎస్ఐ పాస్టర్ సంజీవ్‌కుమార్, లూథరన్ చర్చి పాస్టర్ పల్లాల ప్రకాశరెడ్డి, సంఘ పెద్దలు శాంతబాబు, రాజుకుమార్, విక్టర్‌బాబు, రమేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా బుధవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దట్టంగా మంచు కురుస్తున్నా లెక్కచేయకుండా ఇంటిల్లిపాది పొలం పనులకు వెళ్లారు. కొన్ని చోట్ల తమ దుక్కిటెద్దులకు, నాగలికి పసుపు, కుంకుమలు అద్ది ఏరువాక సాగారు.

పొలం పనులకు శ్రీకారం చుడుతు దుక్కులుదున్నారు. పంటలు బాగా పండాలని పూజలు చేశారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ప్రత్యేక వంటకాలు తయారు చేసి స్నేహితులు, బంధువులకు పంచిపెట్టారు. అనంతరం కుటుంబసమేతంగా కలిసి భోజనాలు చేశారు. ఇళ్లన్నీ చిన్నారులతో సందడిగా మారాయి. రోజంతా స్నేహితులు బంధువులతో సంతోషంగా గడిపారు.

గ్రామాల్లో సీతాల పండగ సందడి

- కల్లాల్లో ధాన్యాపు గింజలకు గిరిజన రైతులు పూజలు
- బంధుమిత్రులతో పండగ నిర్వహణ



ముంచంగిపుట్టులో ధాన్యం కుప్పకు పూజలు చేస్తున్న గిరిజన రైతులు



సీతాల పండుగ కోసం ప్రత్యేకాలంకరణలో ధాన్యాల కుప్పలు

ముంచంగిపుట్టు: గిరిజనులు పూర్వీకులు నుంచి వచ్చే ప్రతి ఆచార వ్యవహారాలను నేటి తరం వరకు పాటించడం ఆనవాయితీ. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో రైతులు పంటలకు చేసే ప్రతి పూజ ప్రత్యేకతను సంతరించుకొని ఉంటుంది. ప్రతి పండుగ భిన్న వాతావరణంలో జరుపుకుంటారు. సంప్రదాయాలను, ప్రత్యేకతలు ఆచరిస్తుంటారు. ప్రస్తుతం గిరిజన గ్రామాల్లో సీతాలు పండుగ సందడి నెలకొంది. రైతులు పండిన పంటను పొలాల్లోను, కల్లాల్లోను ఉన్న ధాన్యాపు గింజలను కుప్పగా పోసి ఎంతో సుందరంగా అలంకరించి సీతాల పండుగకు సిద్ధం చేశారు.

పండగ ప్రత్యేకత

ప్రతి గిరిజన గ్రామంలోనూ ప్రస్తుతం గిరిజన రైతుల పండుగ(సీతాల) సందడి నెలకొంది. వరి పంటను నూర్పిళ్లు పూర్తయిన తర్వాత వచ్చిన ధాన్యాన్ని కలాల్లో పోగుగా పోసి అలంకరిస్తారు. కొంత ధాన్యాన్ని బియ్యంగా మలిచి పరమాన్నం, అన్నంగా వండుతారు. కుటుంబ సభ్యులు, బంధువులు ముఖ్యంగా చిన్నారులు అందర్ని కల్లాలకు ఆహ్వానిస్తారు. కుప్పగా పోసిన ధాన్యాన్ని పూలతో మొగ్గలతో సుందరంగా తీర్చిదిద్దుతారు. చేటలు, కోతలకు ఉపయోగించిన కొడవల్లను ధాన్యం కుప్ప చుట్టూ ఉంచుతారు. కుల దైవాన్ని, కుల దేవతలను తలుచుకొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. పంట దిగుబడి బాగా రావాలని, ప్రకృతి ప్రకోపాలతో పంటను కాపాడాలను కోరుకుంటూ ఇష్టదైవానికి పూజలు చేస్తారు. మొక్కులు చెల్లించుకుంటారు. కొత్త బియ్యంతో వండిన అన్నాన్ని వండి అందరూ కలిసి సహపంక్తి భోజనం చేస్తారు.

బంధు మిత్రులతో కలిసి సీతాలు నిర్వహించడం వల్ల పంట దిగుబడి విషయంలో ఎటువంటి దాపరికం ఉండదని గిరిజన పూర్వీకులు ఈ పండగను నిర్వహించే వారని తాము పాటిస్తున్నామని పలువురు గ్రామస్తులు చెబుతున్నారు. పూర్వీకులు సూచించిన ఆచార వ్యవహారాలు పాటిస్తూ గిరిజనులు సంస్కృతి సంప్రదాయాలు అనుసరిస్తూ రానున్న భావి తరాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

4న వినికిడి యంత్రాల పంపిణీకి వైద్య శిబిరం

నాతవరం : వినికిడి సమస్య ఉన్న వారికి ఈనెల 4వ తేదీన నర్సీపట్నంలో ఉచితంగా వినికిడి యంత్రాలు అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ డిసెంబరు 30వ తేదీన నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో వినికిడి సమస్య ఉన్న వారిని పరిక్షించేందుకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారన్నారు. ఆ రోజు డివిజన్ స్థాయిలో గల అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో వినికిడి సమస్య ఉన్నవారు రావడంతో తక్కువ మందిని మాత్రమే పరీక్షించడం జరిగిందన్నారు. సమయం చాలక చాలా మందిని పరిక్షించకపోవడంతో అధిక సంఖ్యలో వెనుదిరిగారన్నారు. ఈ విషయంపై వైద్యశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి మండలాలు వారీగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారన్నారు. నాతవరం మండలం వారికి 4వ తేదీన శనివారం ఉదయం 10 గంటల నుంచి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక వైద్యులతో వినికిడి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్య శిబిరానికి వెళ్లే వారు ఆధార్ కార్డు , రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు, రెండు పాస్ ఫొటో సైజు ఫొటోలు వెంట తీసుకెళ్లాలన్నారు.



పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో మేలుకొలుపులు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో బుధవారం మేలుకొలుపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామునే రామాలయానికి చేరుకున్న భక్తులు పూజలు చేసిన అనంతరం వీధుల్లో రామ నామ సంకీర్తన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

అచ్యుతాపురం: ధనుర్మాసం విష్ణువుకు అత్యంత ప్రీతికరమైన మాసమని సమరసతా సేవా ఫౌండేషన్ యలమంచిలి సబ్ డివిజన్ ధర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు అన్నారు. అచ్యుతాపురం మండలం దోసూరు శివారు గండివానిపాలెంలో బుధవారం నిర్వహించిన మేలుకొలుపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ధనుర్మాసం విశిష్టతను వివరించారు. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించిన నాటి నుంచి ఉత్తరాయనం మొదలవుతుందని తెలిపారు. గోదాదేవి ధనుర్మాసం అంతా స్వామిని కీర్తించి స్వామిని చేరిందన్నారు. ధనుర్మాసంలో తెల్లవారు జామున చేసే మేలుకొలుపులు, నామ సంకీర్తన చాలా మేలు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గండి అప్పారావు, రాజు, రవి, గండి సురేశ్, నాయుడు, దేవి, రాజేశ్వరి, సబ్బవరపు చిన్నికృష్ణ, ఆత్మకూరు వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల : స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. స్వామివారు ఏడాది కొకసారి ఇళ్ల ముందుకు రావడంతో ఎదురుగా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమం

మాడుగుల రూరల్: మండలంలో వీరవల్లి అగ్రహారం గ్రామములో ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామములో గల అభయాంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల సందర్భంగా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటలు వరకు భజన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మేలుకొలుపు కార్యక్రమంలో భాగంగా పుర వీధుల్లో భక్తి పాటలతో ఉరేగింపు చేస్తున్నారు. నెల గంట నుంచి భోగి పండగ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని భక్త బృందం సభ్యులు పేర్కొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో గల ఎస్ఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన నానుబోలు రామారావుకు ప్రాజెక్టు ఉద్యోగులు బుధవారం వీడ్కోలు సభను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రామారావు అతని సతీమణి సుజాతకు జ్ఞాపికలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్ఈ బి.గోవిందరాజులు మాట్లాడుతూ ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు ఉంటుందన్నారు. సమాచార వ్యవస్థ అంతంతమాత్రమే ఉన్న సమయంలో రామారావు అందించిన సేవలు మరువలేనివన్నారు. నూతన ఉద్యోగులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రామారావు చేసిన సేవలను కొనియాడారు. ఏడీఈలు భుజసుందర్‌పాడి, ఒబుల్‌రెడ్డి, గంగాభవాని, ప్రాజెక్టు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన రామారావు దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

కోలాటం కళాకారులకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జ్యోతికుమార్

ఎస్.రాయవరం: కొత్త సంవత్సరం సందర్భంగా ఎస్.రాయవరం గ్రామంలో కోలాటం ఆడుతున్న 50 మంది మహిళా కళాకారులకు గోకులపాడు యూత్ సంఘ నాయకుడు లింగంపల్లి జ్యోతికుమార్ బుధవారం చీరలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరికి ఏదో ఒక ప్రత్యేక ఉంటుందని, వాటిపై దృష్టి పెడితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఆయన అన్నారు.

10 మంది పేకాటరాయుళ్లపై కేసు

మునగపాక: మండలంలోని చెర్లోపాలెం శివారు పేకాడుతున్న పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. మంగళవారం రాత్రి చెర్లోపాలెం శివారులో పేకాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న పది మందితో పాటు వారి నుంచి రూ.23,850 నగదు స్వాధీనం చేసుకున్నారు. 5 బైక్‌లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపా రు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి తదితరులు




క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న అభిమానులు, స్థానికులు

ముంచంగిపుట్టు: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం డీటీఎఫ్ క్యాలెండర్‌ను ఎంఈవో కృష్ణమూర్తి ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు క్యాలెండర్, స్టిక్కర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో కృష్ణమూర్తి మాట్లాడుతూ సంవత్సరంలో మండలంలో అన్ని పాఠశాలలు సర్వతోముఖంగా తీర్చిదిద్దబడాలని, విద్యాపరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్నారు. నాయకులు కామేష్, మాలయ్య, గున్నిపడాల్, చంద్రశేఖర్ తదితరలు పాల్గొన్నారు.

పాడేరు రూరల్: సినీనటులు హీరో సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబుల అభిమాన సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఉమా నీలకంఠేశ్వర స్వామివారి దేవాలయం ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు రామం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అభిమాన సంఘాల అధ్యక్షుడు రామారావు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, అప్పలరాజు, సూర్యసింగ్, అప్పారావు, గిరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



ర్యాలీ చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

అచ్యుతాపురం: భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మండలంలోని హరిపాలెం, అచ్యుతాపురం, పూడిమడక, దోసూరు గ్రామాల్లో కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లు అందజేయాలన్నారు. ప్రమాదాలకు గురైన కార్మికులకు ప్రభుత్వం వైద్యం అందించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాజాన అప్పలనాయుడు, శ్రీను, రమేశ్, రాజు, పాల్గొన్నారు.